క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పాటిపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విమలగిరి

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రంగా పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. పాటిపల్లిలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి ముందు నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. లార్వా వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించిన మందులను అందజేశారు. సర్పంచ్ ఆడారి కృష్ణవేణి, సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఉమామహేష్, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు



గంగాదేవిపేటలో సర్వేను పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాక: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర తెలిపారు. మండలంలోని గంగాదేవిపేటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన ఆరోగ్య సమస్యలను అక్టోబర్ 6న తోటాడ సచివాలయం వద్ద జరిగే మెడికల్ క్యాంపులో పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలు



మునగపాకలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: జగనన్న స్వచ్ఛ సంకల్పం శత శాతం అమలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాకలో స్వచ్ఛ సంకల్ప ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మునగపాకను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలన్నారు. ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఏఎన్‌ఎం దేవకి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ అలీ

మునగపాక: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ మహమ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డులో శుక్రవారం ఆటో యజమానులు, డ్రైవర్లతో మాట్లాడారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. మద్యం తాగి ఆటోను నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లినా కేసులు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల నిరసన

ఎస్.రాయవరం: జీపీఎస్‌కు వ్యతిరేకంగా మండలంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరయ్యారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎస్ మండల కార్యవర్గ సభ్యుడు గారా ప్రకాష్‌రావు, పి.ధర్మవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వి. రమణారావు, ఉపాధ్యాయులు బి.శ్రీను, దీపిక, భవాని తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో 'సాగు'దాం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు



మందుల పిచికారీకి వినియోగించే డ్రోన్

- మందుల పిచికారీలో వినియోగంతో మేలు
- సమయం, ఖర్చు ఆదా
- అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు
- ఉచిత శిక్షణ, రాయితీపై పరికరం అందజేస్తున్న ప్రభుత్వం

అన్ని రంగాల్లో సాంకేతికత పెరుగుతోంది. సాగులో కూడా యాంత్రీకరణ, సాంకేతికత అవసరం పెరుగుతున్నాయి. డ్రోన్ల సాయంతో భూ సర్వే చేస్తుండగా, సస్యరక్షణ మందుల పిచికారీకి కూడా వీటిని వినియోగిస్తున్నారు. డ్రోన్‌ల ద్వారా పురుగు మందుల పిచికారీపై నియోజకవర్గంలో రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. యంత్రసేవా పథకం ద్వారా వీటిని రాయితీపై ప్రభుత్వం అందజేస్తోంది.

రాంబిల్లి: వ్యవసాయ పనులు చేసే కూలీలు సరిపడినంతగా అందుబాటులో ఉండడం లేదు. దీంతో పనులు ఆలస్యమవుతున్నాయి. ముఖ్యంగా చీడపీడల నివారణకు మందుల పిచికారీకి సకాలంలో కూలీలు దొరకడం లేదు. దీంతో తెగుళ్ల బారిన పడిన పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయంలో ఇప్పటికే యంత్ర వినియోగం పెరిగింది. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, నాట్లు, కోత, నూర్పిడి యంత్రాలను వినియోగిస్తున్నారు. వీటితో పాటు క్రిమికీటకాలు, చీడపీడల నివారణ మందు పిచికారీకి డ్రోన్లు వినియోగించడ వల్ల మేలు కలుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

సమయం ఆదా

డ్రోన్ వినియోగించడ వల్ల 90 శాతం తక్కువ సమయంలో పిచికారీ పూర్తవుతుంది. కేవలం రూ.500 ఖర్చుతో 6 నుంచి 10 నిమిషాల సమయంలో ఎకరా పొలంలో పంటపై మందు పిచికారీ చేయవచ్చు. తక్కువ శ్రమతో 10 లీటర్ల తక్కువ నీటితో, 25 శాతం తక్కువ మందుతో ఒక ఎకరా పొలంలో స్ప్రేయింగ్ చేయవచ్చు. గిరిజన ప్రాంతాల్లో పంటలపై కూడా డ్రోన్ సాయంతో స్ప్రేయింగ్ చేయవచ్చు. డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేయడం వల్ల రైతులు, కూలీలు, వాతావరణంపై మందు ప్రభావం ఉండదు. డ్రోన్ల వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. డ్రోన్ ఖరీదు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. ఐదుగురు కలిసి గ్రూపుగా ఏర్పడితే ప్రభుత్వం రూ.65 వేల ఖర్చు అయ్యే శిక్షణను ఉచితంగా ఇస్తుంది. అంతేగాక డ్రోన్ కొనుగోలులో 40శాతం రాయితీ ఇస్తుంది. ఐదుగురు గల గ్రూపు రైతులు కేవలం 10శాతం ఖర్చు చేస్తే సరిపోతుంది. మిగిలిన 50 శాతం బ్యాంకు నుంచి రుణం లభిస్తుంది.

అవగాహన కార్యక్రమాలు

డ్రోన్ వినియోగం, కలిగే ప్రయోజనాలపై నియోజకవర్గంలో రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యలమంచిలి మండలంలో సోమలింగపాలెం, తెరువుపల్లి, రాంబిల్లి మండలంలో దిమిలి, నారాయణపురం, మామిడివాడ, పంచదార్ల, మునగపాక మండలం చూచుకొండ తదితర గ్రామాల్లో ఇప్పటికే అవగాహన సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. డ్రోన్ల వినియోగానికి ముందుకొచ్చే రైతులకు గుంటూరులోని లామ్ ఫారంలో శిక్షణ ఇస్తారు.

డ్రోన్ల వినియోగంతో మేలు



సాగు విధానంలో యంత్ర వినియోగంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. సమయం ఆదాతో పాటు ఖర్చు బాగా తగ్గి త్వరితగతిన పనులు పూర్తవుతాయి. డ్రోన్‌తో పిచికారీ చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా ఆకులు నుంచి కాండం వరకు పూర్తి స్థాయిలో రసాయన మందు పడి క్రిమి కీటకాలు, చీడపీడలు నశిస్తాయి. డ్రోన్ కొనుగోలుకు ప్రభుత్వం 40శాతం రాయితీ ఇస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

–శ్రీకాంత గౌడ, హరిపురం బీసీటీ కేవీకే యాంత్రీకరణ శాస్త్రవేత్త

సాగునీటి కాలువలపై గేట్ల ఏర్పాటుకు వినతి



రైతులతో సమావేశమైన అధికారులు

రాంబిల్లి: సాగునీటి కాలువలపై గేట్లు ఏర్పాటు చేయాలని దిమిలి రైతులు కోరారు. దిమిలిలో శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయ, నీటి పారుదల శాఖల అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. తామరచెర్ల కాలువపై గల గేట్లకు మరమ్మతులు నిర్వహించి, పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరారు. ఈ పనులకు సంబంధించి అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని నీటి పారుదల శాఖ ఏఈ ఎ.భాను తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 3వేల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయని ఏవో సి. సుమంత తెలిపారు. అందరూ ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పి. భాగ్యవతి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, వీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఈవోఆర్డీ వెంకటలక్ష్మి

మునగపాక: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈవోఆర్డీ పి.వెంకటలక్ష్మి కోరారు. ఈవోఆర్డీగా వెంకటలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని, ఇంటిపన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తదితరులను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



బోరు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా రూ.9 లక్షల వ్యయంతో ఎనిమిది మంచినీటి బోర్లు జిల్లా పరిషత్ సభ్యుడు స్వామి సత్యనారాయణ కోటా ద్వారా మంజూరయ్యాయి. ఈ మేరకు మునగపాక జగనన్న లే-అవుట్‌లో జరుగుతున్న మంచినీటి బోరు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు బోర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు సహకారంతో మునగపాక మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఎక్కడైనా తాగునీటి సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

పన్నులు శత శాతం వసూలు

- మున్సిపల్ ఆర్డీ నాగరాజు ఆదేశం



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఆర్డీ నాగరాజు

యలమంచిలి : పురపాలక సంఘంలో పన్నులు శత శాతం వసూలు చేయాలని మున్సిపల్ ఆర్డీ నాగరాజు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో ఆస్తి, ఇంటి, నీటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ తడి పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేయడంలో అధికారులు ప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీలక్ష్మి, శానటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కోటవురట్ల: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు శుక్రవారం తెలిపారు. పాములవాక, అన్నవరం గ్రామ సచివాలయాల పరిధిలో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. ఈ నెల 23న దరఖాస్తుల స్వీకరణ, 25న పరిశీలన, 26న ఇంటర్వ్యూలు, 27న ఎంపికైన అభ్యర్థికి నియామక పత్రం అందజేత, 28 నుంచి విధుల్లో చేరిక ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేత్రపర్వంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. కొండపై వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం దిగువన ఉత్సవ మూర్తులకు, ఆండాళ్లమ్మవారికి, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామివారికి నిత్యార్చనలు అభిషేకాలు జరిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి గ్రామ బలిహరణలు పూర్తిచేశారు. అనంతరం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. తరువాత దేవదేవుడిని ఇత్తడి సప్పర వాహనంలో వేం చేయింపజేసి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, రాజగోపాలాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

మునగపాక: డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలు బాధ్యతగా పనిచేసి సంఘాలను బలోపేతం చేయాలన్నారు. సంఘాల లావాదేవీలపై దృష్టి సారించాలని తెలిపారు. సంఘాల ద్వారా తీసుకున్న రుణాలు సద్వినియోగమయ్యేలా చూడాలన్నారు. అనంతరం విత్తనాలు పంపిణీ చేశారు. ఏరియా కో-ఆర్డినేటర్ ధర్మారావు, ఏపీఎం కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ హక్కు పత్రాల పంపిణీ

ఎస్.రాయవరం: మండలంలో రీసర్వే పనులు పూర్తయిన గ్రామాల్లో రైతులకు భూహక్కు పత్రాలు అందజేయనున్నట్టు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సర్వే పూర్తి అయిన వేమగిరి, పి.ధర్మవరం, పెట్టుగోళ్లపల్లి రైతులకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతులమీదుగా ఈపత్రాలు అందజేయనున్నట్టు చెప్పారు.

80 శాతం రాయితీపై చిరుధాన్యాల విత్తనాలు



సమావేశమైన అధికారులు

పాయకరావుపేట: మండలంలోని రైతులకు 80 శాతం రాయితీ పై చిరుధాన్యాలు, అపరాల విత్తనాలు సరఫరా చేయనున్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ, నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు సరిపడనంతగా పడలేదని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడం వల్ల రైతులు వరినాట్లు పూర్తి చేయలేదన్నారు. అందువల్ల ప్రస్తుతం సరఫరా జరుగుతున్న సాగునీటిని సద్వినియోగం చేసుకుని రైతులు చిరుధాన్యాలు, అపరాలు పంటలు వేసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.

24న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం నునపర్తి శ్రీరామా బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 24న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంప నర్సింహనాయుడు తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అండర్-16 విభాగంలో జరిగే ఈ ఎంపిక పోటీలో పాల్గొనేందుకు 2008 జనవరి రెండు తర్వాత జన్మించిన వారు అర్హులని చెప్పారు. ఎంపిక రోజు ఉదయం నునపర్తి చేరుకోవాలని పేర్కొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

- తగరంపూడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ సూరిబాబు



తగరంపూడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ, కమిటీ సభ్యులు

అనకాపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. మండలంలోని తగరంపూడి పీహెచ్‌సీలో శుక్రవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆస్పత్రి సమస్యలపై అధికారులు, వైద్యులు, సిబ్బందితో చర్చించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కమిటీ పలు అంశాలపై తీర్మానాలు చేసింది. ఆస్పత్రిలో చెదల నివారణ చర్యలు, బయో మెడికల్ వ్యర్థాలు నిల్వ ఉంచేందుకు అవసరమైన కవర్లు, గ్రీన్ క్లాత్ కొనుగోలు, దోమల నియంత్రణలో భాగంగా ఆస్పత్రి భవనం మొత్తం కిటికీలకు మెష్‌ల ఏర్పాటు, కంటింజెంట్ వర్కర్ల జీతభత్యాల చెల్లింపు, ల్యాబ్ కప్ బోర్డ్, గ్యాస్ సిలిండర్ ఏర్పాటు, కొత్త ఇన్వర్టర్ కొనుగోలు, అత్యవసరమైన విద్యుత్తు, ప్లంబింగ్ పనులు, ఎమెర్జెన్సీ లైటు కొనుగోలు కోసం సభ్యులు తీర్మానించారు. ముఖ్యంగా ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీరు నిలిచి, రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వైద్యులు, సిబ్బంది కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపీపీ మండల పరిషత్ నిధులతో ఆస్పత్రి ఆవరణ అంతా గ్రావెల్‌తో చదును చేయడానికి తీర్మానించారు. అనంతరం ఆస్పత్రికొచ్చిన రోగులతో వైద్య సేవలపై ఆరా తీశారు. సమావేశంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు, తహసీల్దార్ పీవీఎల్‌ఎన్ గంగాధరరావు, వైద్యాధికారులు జి.పావని, జి.రమ, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, దిబ్బపాలెం సర్పంచ్ పి.ఉష, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

24 నుంచి భగవద్గీత శ్లోకాలపై ఉచిత శిక్షణ

మునగపాక: మండలంలోని తోటాడలో ఈ నెల 24వ తేదీ నుంచి భగవద్గీత శ్లోకాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఓంకార పీఠం ప్రాంగణంలో ప్రతి ఆదివారం ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్న చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా ఈ శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కల వారు 9642386189, 9046784576 అనే ఫోన్ ననంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన విద్యను అందించండి



విద్యార్థులతో కలిసి రాగిజావ తాగుతున్న సర్పంచ్ శివరాం

కోటవురట్ల: చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలని సర్పంచ్ పైల శివరాం అన్నారు. చినబొడ్డేపల్లిలోని ఎంపీపీ స్కూల్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. విద్యాబోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న గోరుముద్ద అమలుతీరు పరిశీలించారు. విద్యార్థులతో పాటు రాగిజావ తాగారు. ప్రతి విద్యార్థి జావ తాగేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం కె.అప్పలనాయుడుకు సూచించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేయాలని కోరారు. పాఠశాల భవనం శ్లాబ్ పెచ్చులూడి అక్కడక్కడా నీరు కారిపోతోందని, మరమ్మతుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని హెచ్‌ఎం అప్పలనాయుడు సర్పంచ్‌ను కోరారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరం శివారు తోటలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపారు. వారి వద్దనుంచి రూ.250 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

నేత్రపర్వంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక గౌరీ పంచాయతన దేవస్థానంలో గౌరీపరమేశ్వరుల 184వ ఊంజల్ సేవ శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. బుద్ధ మహాలక్ష్మి(అరవింద్), ఝాన్సీ దంపతులచే అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషసాయి ఊంజల్ సేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, పాలకవర్గ సభ్యులు, శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి, శ్రీ గౌరీ పరమేశ్వరి అమృత వర్షిణి బృంద సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి ప్రారంభోత్సవం నేడు

కశింకోట: కశింకోట పంచాయతీ పరిధిలో రూ.80 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం తెలిపారు. రూ.25 లక్షలతో బాలుర స్కూలు నుంచి సతకంపట్టు రామాలయం వరకు, అక్కడి నుంచి కుమ్మరి వీధి వరకు నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ, రూ.20 లక్షలతో గాడి వీధిలో సిమెంట్ రోడ్డు, మందబయల కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తారన్నారు. రూ.25 లక్షలతో కనకమహాలక్ష్మి వీధి, రూ.10 లక్షలతో శిలపరశెట్టి వీధిలోను నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రైన్లు, మరో రూ.10 లక్షలతో గవరపేట మధ్య వీధి నుంచి దుర్గమాంబ ఆలయం వరకు నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వ్యాస రచన పోటీలకు హాజరైన విద్యార్థులు

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వినాయక సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి అన్నారు. స్థానిక భాష్యం స్కూల్‌తోపాటు, మరో 24 విద్యా సంస్థల్లో శుక్రవారం విద్యార్థులకు మట్టి గణపతి పూజించండి -పర్యావరణాన్ని పరిరక్షించండి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో 25 స్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 500 మంది విద్యార్థులకు పట్టణంలోని పలు స్కూళ్లలో శనివారం కూడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నవరాత్రి వేడుకలు పూర్తయిన తర్వాత కమిటీ ఆధ్వర్యంలో బహుమతి ప్రధానోత్సవం ఉంటుందన్నారు. పోటీలకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్‌తోపాటు ఒక బహుమతి కూడా అందిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు, టాప్ 20 మందికి కూడా బహుమతులందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పి.రమ, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డీవీఎన్ కళాశాలలో ఉద్యోగ మేళా

అనకాపల్లిటౌన్: స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో శనివారం ఉదయం 9 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, తమకు అవసరమైన మేరకు, అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్ కార్డు, సంబంధిత ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.